క్లుప్తంగా

ఘనంగా శివలింగం ఊరేగింపు



కలశాలతో వస్తున్న ముత్తైదువులు, చిన్నారులు

కౌతాళం: మండల పరిధిలోని ఎరిగేరి గ్రామంలో నిర్మిస్తున్న బసవేశ్వరస్వామి ఆలయంలో ప్రతిష్టించడానికి శివలింగం రావడంతో గ్రామస్తులు సోమవారం గ్రామపుర విధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. శివలింగాన్ని కాశీ నుంచి తీసుకురాగా.. గ్రామంలోని మహిళలంతా కలశాలతో ఎదురు రాగా డప్పువాయిద్యాలు, బాజభజంత్రిలతో ఊరేగించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోవిందు, గ్రామ పెద్దలు సూర్యనారాయణరెడ్డి, నీలకంఠరెడ్డి, రామాంజినేయులు పలువురు పాల్గొన్నారు.

వాల్మీకి వర్గాన్ని కించపరిస్తే సహించం



మాట్లాడుతున్న బీసీ సెల్ అధ్యక్షుడు టి.మురళీ నాయుడు

గోనెగండ్ల: వాల్మీకి సామాజిక వర్గాన్ని కించపరిచేలా మాట్లాడితే సహించమని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు టి. మురళీ నాయుడు అన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి వాల్మీకి వర్గాన్ని కించపరిచేలా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇది వాల్మీకి వర్గీయులందర్నీ కించపరచడమేనన్నారు.ఇటువంటి వ్యాఖ్యలు సామాజిక ఐక్యతను దెబ్బతీసేలా ఉంటాయని, జేసీ ప్రభాకర్ రెడ్డిని తక్షణమే టీడీపీ నుంచి సస్పెండ్ చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఆయనపై చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా వాల్మీకి వర్గానికి చెందిన ప్రజలను సమీకరించి తాడిపత్రి పోలీస్ స్టేషన్‌ను ముట్టడించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు దొరబాబు నాయుడు, మండల ఉపాధ్యక్షుడు చికెన్ రాజా, నాయకులు ఖాజా, శ్రీరంగ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ఏఓ మదిరిపల్లె శివశంకర్

ఎమ్మిగనూరురూరల్: రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలని ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి, ఏఓ మదిరిపల్లె శివశంకర్ సూచించారు. సోమవారం స్థానిక ఏడీఏ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై రైతు సేవా కేంద్రాల వీఏఏలు, ఎన్‌హెచ్‌ఏలు, వీఎస్ఏలకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ప్రకృతి వ్యవసాయంపై ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ప్రయోజనాలను తెలియజేశారు. వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా ఎక్కువ ఆదాయం పొందడంతో పాటు నేలలో జీవ పదార్థం పెరుగుతుందని చెప్పారు. శిక్షణలో గోనెగండ్ల ఏవో హేమలత, ఎన్ఎఫ్ఏ జగదీష్, ఎంటీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులను సంరక్షించుకోవాలి



మంత్రాలయంలో జింక పిల్లను కానిస్టేబుళ్లకు అందజేస్తున్న దృశ్యం

మంత్రాలయం రూరల్ : ప్రతి ఒక్కరూ వన్య ప్రాణులను సంరక్షించుకోవాలని ఎస్ఐ శివాంజల్ అన్నారు. సోమవారం నందవరం గ్రామానికి చెందిన శ్యామ్‌సన్ గంగవరం మీదుగా మంత్రాలయానికి బైక్‌పై బయలుదేరాడు. మార్గ మధ్యంలో నదికైరవాడి- మంత్రాలయం సమీపంలోని సుంకప్ప తాత దర్గా వద్ద పొలాల్లో జింక పిల్లను కుక్కలు తరముతుండగా గమనించాడు. కుక్కల బారీ నుంచి జింక పిల్లను రక్షించాడు. అనంతరం మంత్రాలయం పోలీస్‌స్టేషన్‌లోని హెడ్ కానిస్టేబుళ్లు లక్ష్మీనారాయణ, రమణలకు అప్పగించాడు. వారు జింకను పారెస్టు కానిస్టేబుల్ శంకర్ నాయక్‌కు అప్పగించినట్లు తెలిపారు.

బీమా పరిహారం అందజేత

కౌతాళం: ప్రతి ఒక్కరికి ప్రమాద బీమా తప్పని సరిగా అవసరమని కర్నూలు పోస్టల్ సూపరింటెండెంట్ జనార్ధన్‌రెడ్డి అన్నారు. ఉరుకుంద గ్రామంలో పోస్టల్‌శాఖ నుంచి ప్రమాద బీమా తీసుకున్న మండుల చంద్రశేఖర్ మృతి చెందగా.. నామిని అయిన భార్య నరసమ్మకు బీమా పరిహారం అందజేశారు. గతేడాది పోస్టల్‌లో ప్రమాద బీమా చేయించుకోగా చంద్రశేఖర్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందడంతో రూ.10,72,838 మంజూరైనట్లు ఆయన తెలిపారు. గ్రామ పోస్టుమ్యాన్ మల్లప్పగౌడ్, దివాకర్‌రెడ్డి, కురుగోడు, కోట్రేష్‌గౌడ్ పాల్గొన్నారు.



జోహరాపురంలో బురద మయంగా రోడ్డు



మిట్టసోమపురంలో బీసీ కాలనీ(తెలుగు గేరి)లోని రోడ్డు దుస్థితి

చినుకు పడితే చిత్తడే

- చిన్నపాటి వర్షానికే బురద మయంగా గ్రామీణ రహదారులు
- రోడ్లపైనే మురుగు
- ఇబ్బందులు పడుతున్న పల్లె వాసులు

నందవరం : కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరవాత గ్రామాల్లో అభివృద్ధి కుంటు పడింది. పల్లెల్లో కనీసం సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించక పోవడంతో పల్లె వాసులు ఇబ్బందులు పడుతున్నారు. చిన్న పాటి వర్షానికే రోడ్లు చిత్తడిగా మారితున్నాయి. మండల పరిధిలోని జోహరాపురం గ్రామంలోకి వెళ్లే దారి చిన్న పాటి వానకే బురద మయంగా మారుతోంది. ఆ రోడ్డులో గ్రామస్తులు నడవలేని పరిస్థితి. రోడ్డుపై బురదకు తోడు మురుగు నీరు ప్రవహిస్తుండంతో అడుగుతీసి అడుగు వేయలేని దుస్థితి. మిట్టసోమపురం గ్రామంలో బీసీ కాలనీలో ఊరి చావిడి వద్ద నుంచి తెలుగు గేరి వరకు రోడ్డు దుర్భరంగా ఉంది. మురుగు, వర్షపు నీరు రోడ్లపై నిలిచి దుర్వాసన వెదజల్లుతుంది. చిన్న పాటి వర్షం కురిస్తే రోడ్లంతా బురద మయంగా మారుతున్నాయి. ఆయా కాలనీల వాసులు, రైతులు ఇళ్లలో నుంచి బయటకు అడుగు పెట్టాలంటే ఇబ్బందులు పడాల్సివస్తోంది. రోజుల తరబడి రోడ్లపై వర్షపు నీరు, మురుగు నీరు నిలిచి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. దోమలు వ్యాప్తిచెంది రోగాలు ప్రబలే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. కూటమి సర్కార్ అధికారం చేపట్టి గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తామని నాయకులు ఉత్తమాటలు చెప్పారని, తమ గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేక వర్షపు నీరు రోడ్లపైనే నిలిచిస్తుందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని కోరుతున్నారు.

పదవికి న్యాయం చేస్తా



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనకు అప్పగించిన పార్టీ రాష్ట్ర కార్యదర్శి పదవికి న్యాయం చేస్తానని ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. తనను గుర్తించి పదవి ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. సోమవారం సాయంత్రం జిల్లా కేంద్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డిని కలిసి శాలువా కప్పి, పూల బొకె ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పార్లమెంట్ రాష్ట్ర కార్యదర్శి తెర్నెకల్ సురేందర్‌రెడ్డి, యూత్ నాయకుడు ఎర్రకోట రాజీవ్ రెడ్డి, మండల పరిషత్ అధ్యక్షుడు కేశన్న, వైస్ ఎంపీపీ పోలయ్య, సోగనూరు భీమిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుట్టారంగయ్య, ముస్లిం మైనారిటీ నాయకుడు రియాజ్‌అహమ్మద్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మిగనూరుటౌన్: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను ప్రభుత్వం సత్వరం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజినేయులు, మండల అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాముడు డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు చేపట్టిన నిరవధిక దీక్షలో పాల్గొన్నారు. అనంతరం కార్మికులతో ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి వినతి పత్రాన్ని తహసీల్దార్ శేషఫణికి అందజేశారు.

కుట్టు మిషన్లు ఇవ్వండి



ఎంపీడీఓ మణి మంజరికి వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

గోనెగండ్ల: తమకు కుట్టు మిషన్లు ఇవ్వాలని శిక్షణ పొందిన మహిళలు సోమవారం స్థానిక న్యాక్ కుట్టు శిక్షణ కేంద్రం వద్ద నిరసన తెలిపారు. గోనెగండ్లలో ఏప్రిల్ 8వ తేదీ నుంచి ఈ కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. మండలంలోని గోనెగండ్ల, అలువాల, హెచ్. కైరవాడి, చిన్నమరివీడు గ్రామాలకు చెందిన 150 మంది మహిళలు ఇక్కడ 90 రోజుల పాటు శిక్షణ తీసుకున్నారు. అయితే శిక్షణ పూర్తయినా ఇంతవరకూ కుట్టు మిషన్లు ఇవ్వకపోవడంపై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా దీపిక, గాయత్రి, సువర్ణ, కల్యాణి మాట్లాడుతూ కుట్టు శిక్షణ తీసుకున్న తరువాత ఉచితంగా కుట్టు మిషన్, సర్టిఫికెట్‌ను అందజేస్తామని చెప్పారన్నారు. అయితే శిక్షణ పూర్తయి 20 రోజులు కావస్తున్నా ఎవరు పట్టించుకోవడం లేదన్నారు. ఇంకా నేల రోజులు శిక్షణకు రావాలంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల నుంచి వచ్చే వారికి రోజుకు రూ.100 ఖర్చు వస్తుందని, ఇంకా మేము ఖర్చు పెట్టుకోలేమని, అధికారులు స్పందించి ఉచిత కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లు అందజేస్తే గ్రామాల్లో షాపులు పెట్టుకుంటామని తెలిపారు. అనంతరం ఎంపీడీఓ మణి మంజరికు వినతిపత్రం అందజేశారు.

మిషన్ ఇస్తే షాపు పెట్టుకుంటాం



మాది హెచ్. కైరవాడి గ్రామం టైలరింగ్ నేర్చుకుంటే ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందని భావించి కుట్టు శిక్షణలో చేరి వివిధ రకాల డిజైన్లు నేర్చుకున్నాను. అయితే శిక్షణ కాలం పూర్తి అయినా నేటికీ కుట్టు మిషన్, సర్టిఫికెట్‌ను అందజేయాలేదు. మా గ్రామం నుంచి రోజు గోనెగండ్లకు వచ్చి వెళ్తున్నాను. ఇంకా నెల రోజులు రావాలంటున్నారు. మాకు ఇబ్బందిగా ఉంది. మిషన్లు ఇస్తే గ్రామంలో షాపు పెట్టుకోవాలనుకుంటున్నాను.

– జయలమ్మ, హెచ్. కైరవాడి

క్షయవ్యాధిని పారదోలుదాం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

ఆదోని టౌన్: దేశం నుంచి క్షయవ్యాధిని పారదోలేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మెడికల్ ఆఫీసర్ అనిల్‌సాగర్ అన్నారు. సోమవారం పట్టణంలోని రాజరాజేశ్వరి నగర్‌లోని హెల్త్ సెంటర్‌లో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులో ర్యాలీ నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉన్నవారు, గళ్లలో తెమడ మరియు రక్తం పడడం తదితర లక్షణాలు వున్నవారు ప్రభుత్వ ఆసుపత్రిలో గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్‌లు బాబురాజు, జ్ఞానేశ్వర్, సుబ్బమ్మ భాయి, ఏఎన్ఎం శ్రీదేవి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

కోసిగి: క్షయవ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కందుకూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి రజిత, ఆదోని క్షయ నివారణ పర్యవేక్షకులు స్వరూప్ కుమార్ సూచించారు. సోమవారం మండలంలోని కందుకూరు ప్రాథమిక కేంద్రం పరిధిలోని కామన్‌దొడ్డి గ్రామంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ఆశా వర్కర్లు, ప్రజలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ పరీక్షలు నిర్వహించారు. ఎంపీ హెచ్ఈఓ శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీ గీత, పూర్ణిమా, ఏఎన్ఎమ్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మండలంలో విద్యావ్యవస్థ అధ్వానం



మాట్లాడుతున్న ఎంఈఓ మెయినుద్దీన్

కోసిగి: మండలంలో విద్యా వ్యవస్థ పూర్తి అధ్వానంగా తయారైందని మండల సభ్యులు ఎంపీపీ ఈరన్న, కోసిగి ఎంపీటీసీ గానిగ దేవమ్మ, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఈరన్న అధ్యక్షతన, ఎంపీడీఓ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలో చాల పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు లేరని, తల్లికి వందనం డబ్బు చాల మందికి పడలేదని, ఉపాధ్యాయులను అడిగితే సచివాలయానికి వెళ్లమంటారు, అక్కడికి వెళ్తే ఎవరూ పట్టించుకోవడం లేదని ఎంఈఓ మెయినుద్దీన్‌ను నిలదీశారు. ఎంఈఓ మాట్లాడుతూ మండలంలో 212 మంది ఉన్న చోట 104 మంది మాత్రమే ఉపాధ్యాయులు ఉన్నారని, త్వరలోనే డీఎస్సీ ద్వారా టీచర్ పోస్టులు భర్తీ కానున్నట్లు తెలిపారు. తల్లికి వందనం కింద మండలంలో 320 మందికి పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసిందన్నారు. వాటిని సరిచేసి నివేదిక పంపుతున్నట్లు వివరించారు. అలాగే జంపాపురం గ్రామానికి చెందిన ఆరుగురు విద్యార్థులు స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికైన రాజకీయం చేసి వారికి రాకుండా అన్యాయం చేశారని, విచారణ చేసి ఆ విద్యార్థులకు న్యాయం చేయాలని సభ్యులు కోరారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తిమ్మరాజు, వైద్యాధికారి అభిరూప్, ఏఓ వరప్రసాద్, పీఆర్ ఏఈ అబ్దుల్ సయ్యద్ మాలిక్, ఎల్లెల్సీ ఏఈ రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ అనుమతి రద్దు చేయాలి

ఎమ్మిగనూరురూరల్: విద్యాహక్కు చట్టాన్ని అమ లు చేయని పట్టణంలోని భాష్యం స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని న్యాయవాది, సామాజిక ఉద్యమ కార్యకర్త ఏ. తిమ్మప్ప డిమాండ్ చేశారు. సోమవారం ఆర్టీఈ ప్రైవేట్ స్కూల్స్ పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆర్టీఈ కింద ఎంపికైన విద్యార్థులకు రెండు నెలలు కావస్తున్నా పుస్తకాలు ఇవ్వకుండా స్కూల్ ప్రిన్సిపాల్ ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. అనంతరం ఎంఈవో-1 ఆంజనేయులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీఈ ప్రైవేట్ స్కూల్స్ పేరెంట్స్ అసోసియేషన్ నాయకులు చిన్న ఉసేని, పురుషోత్తం, రవి, ఖడ్గ, సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా గోవిందరావు

ఆదోని అర్బన్: బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా రసాలే గోవిందరావును రాష్ట్ర పార్టీ నియమించినట్లు ఆదోని బీజేపీ అసెంబ్లీ కో-కన్వీనర్ నాగరాజుగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయనను పార్టీ కార్యకర్తలు సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు దేశాయి చంద్రన్న, జిల్లా ప్రధాన కార్య దర్శి ఉపేంద్రకుమార్, మాజీ మండల పరిషత్ అధ్యక్షుడు పంపాపతి పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటం

కౌతాళం: విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిరంతర పోరాటం చేస్తోందని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు అన్నారు. ఎస్ఎఫ్ఐ ముఖ్య నాయకులతో సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా శ్రీనివాసులు, కార్యదర్శిగా విష్ణు, ఉపాధ్యక్షుడిగా ఈరన్న, సహాయ కార్యదర్శులుగా సద్దాం, అన్వేష్‌తో పాటు మరో పది మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

ప్రతి విద్యార్థికి హాస్టల్ సీటు కేటాయించాలి

ఆదోని రూరల్: ప్రభుత్వ హాస్టల్‌కు దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి సీటు కేటాయించాలని పీడీఎస్ఓ రాష్ట్ర నాయకుడు తిరుమలేష్ కోరారు. ఈ మేరకు సోమవారం సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌కు వినతి పత్రం అందజేశారు. మరో కొత్త హాస్టల్‌ను ఏర్పాటు చేసి పేద కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులకు సీట్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గణేష్, ప్రవీణ్, రాజేష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

మంత్రాలయం రూరల్ : అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నియోజకవర్గ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటమ్మ, ప్రాజెక్టు కార్యదర్శి ఎస్సీ బాలు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ధర్నా చేపట్టారు. అనంతరం వినతి పత్రాన్ని ఐసీడీఎస్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ భాగ్యలక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ కార్యదర్శులు విశాలక్ష్మి, భీమేశ్వరి, వరలక్ష్మి, సుజాత, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఫేస్ యాప్‌ను రద్దు చేయాలి

ఆదోని రూరల్: అంగన్‌వాడీ వర్కర్లకు ప్రభుత్వం ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు వరలక్ష్మి, సరోజ, సీఐటీయూ అధ్యక్ష కార్యదర్శులు తిప్పన్న, పి.ఎస్.గోపాల్, మండలాధ్యక్షులు జె.రామాంజనేయులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్లు నిరసన తెలియజేశారు. అంగన్‌వాడీ సెక్టారు లీడర్లు సోమక్క, రిజ్వానా, లలిత, రేణుక, లక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు.

గల్లంతైన మృతదేహం లభ్యం

కౌతాళం: మండల పరిధిలోని లక్ష్మీనగర్ వద్ద తుంగభద్ర దిగువ కాలువలో ఆదివారం కారు బోల్తా పడిన ఘటనలో గల్లంతైన మణికంఠ మృతదేహం సోమవారం పెద్దకడబూరు మండలం నెమలికల్ వద్ద లభ్యమైనట్లు సీఐ అశోక్‌కుమార్ తెలిపారు. మృతదేహం కోసం గజ ఈతగాళ్లు, ఎస్డీఆర్ఎఫ్, రెస్క్యూ టీం, అగ్ని మాపక సిబ్బంది బోట్లతో కాలువ వెంబడి సాయంత్రం 6 గంటల వరకు గాలించినా ఆచూకీ లభించలేదు. రాత్రి 10 గంటల సమయంలో నెమలికల్ వద్ద మృతదేహం వున్నట్లు గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెళ్లి మృతదేహం మణికంఠదిగా గుర్తించి ఆదోనికి తరలించారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్‌రెడ్డి

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం

- సూపర్ సిక్స్‌తో ప్రజలను నిలువునా ముంచారు
- స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుదాం
- పెద్దకడబూరులో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'పై విస్తృత సమావేశం



సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

పెద్దకడబూరు : కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్దామని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని స్థానిక చంద్రమ్మ భవన్‌లో సోమవారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమంపై వైఎస్సార్ సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ త్వరలో చేపట్టే బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమంలో మండలంలోని ప్రతి గడపకు వెళ్లి కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను ప్రజలకు అర్థం అయ్యేలా తెలియజేద్దామన్నాడు. కార్యక్రమం ద్వారా కూటమి ప్రభుత్వం చేస్తున్న దౌర్జన్యాలు, అరాచకాలను ప్రజలకు వివరిద్దామన్నారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక ప్రజలను నిలువునా ముంచారని మండిపడ్డారు. తల్లికి వందనం నియోజకవర్గంలో దాదాపు 2000 మంది తల్లులకు ఇప్పటికి రాలేదని తెలిపారు. రైతులకు రైతు భరోసా ఇవ్వకుండా ప్రతి రైతుకు కూటమి ప్రభుత్వం బాకీ పడిందని, రైతులు పండించే పంటలకు అందించే ఉచిత బీమాకు మంగళం పాడారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పాఠశాలల్లో నాడు – నేడు కింద దాదాపు 90శాతం పనులు పూర్తిచేస్తే మిగిలిన 10శాతం పనులను సంవత్సరం దాటినా పూర్తి చేయలేని పరిస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు.

గత ప్రభుత్వంలో హామీలన్నీ అమలు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలు, కులాలకు అతీతంగా 143 హామీలు, నవరత్న పథకాలు అమలు చేశారని ప్రదీప్‌రెడ్డి తెలిపారు. జగనన్న ప్రజా సంక్షేమం కోసం రూ. 2.50లక్షల కోట్లు ఖర్చు చేశారని చెప్పారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం మాత్రం సూపర్ సిక్స్ పేరుతో కేవలం పింఛన్లు మాత్రమే రూ. 4వేలకు పెంచిందని, కానీ లబ్ధిదారుల్లో కోత విధించిందన్నారు. కొత్త పింఛన్లు ఊసేలేదన్నారు.

ప్రజలకు బాబు మోసాలు వివరించాలి

ఎన్నికల సమయంలో బాబు ష్యూరిటీ–భవిషత్ గ్యారంటీ పేరుతో చంద్రబాబు, పవన్ సంతకాలు పెట్టి బ్యాండ్లు ఇచ్చారని, ఇచ్చిన హామీలపై ప్రజల తరుపున ప్రభుత్వాన్ని నిలదీసే హక్కు ప్రతిపక్షానికి ఉందన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు గ్రామాలలో ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యకర్తల జోలికి వస్తే ఊరుకునేదిలేదని, ఏ కష్టం వచ్చినా మా కుటుంబం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం

త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయని, వాటిలో మన సత్తాచాటి వైఎస్సార్ సీపీ అంటే ఏమిటో అర్థం అయ్యేలా చేద్దామని ప్రదీప్‌రెడ్డి పిలుపునిచ్చారు. తప్పుడు వాగ్దానాలతో ప్రజలను మోసం చేసి న వారికి ఈ ఎన్నికల్లో ప్రజల సత్తా ఏమిటో చూపిస్తే మరోసారి ఇలా తప్పుడు వాగ్దానాలు ఇవ్వాలంటేనే భయపడతారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తంరెడ్డి, మండల అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి, బూత్ కమిటీ డివిజన అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు రవిచంద్రరెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్‌వింగ్ కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, రాష్ట్ర యూత్‌వింగ్ కార్యదర్శి రఘురాముడు, డివిజన్ యూత్‌వింగ్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్ రామాంజినేయులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించండి



ప్రజా సమస్యలు వింటున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం -పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించి, డివిజన్‌లోని ఆయా మండలాల ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయాశాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువు లోపు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వేయర్స్ వేణుసూర్య, శ్రీనివాసరాజు, ఆర్టీసీ డిపో మేనేజర్ మహ్మద్‌రఫీ, గృహ నిర్మాణశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్, ఆర్డీఓ పరిపాలనాధికారి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి బస్సు సౌకర్యం కల్పించాలి

ఆదోని సెంట్రల్: పట్టణం నుంచి ఎర్రకోట ఇంజినీరింగ్ కళాశాలకు వెళ్లే విద్యార్థులకు విద్యార్థి బస్సు సౌకర్యం కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ఆదోని నుంచి ఇంజనీరింగ్ కళాశాలకు చదువుకొనేందుకు వందల సంఖ్యలో విద్యార్థులు వెళ్తున్నారని, సమయానికి బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు నరసింహ, నాగరాజు, రవి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

మంత్రాలయం : స్థానిక బస్టాండ్‌లో ఈనెల 17వ తేదీన కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా మల్కాపురం గ్రామానికి చెందిన బోయ దుల్లయ్య అనే వ్యక్తి మృతికి కారణమైన మాధవరం గ్రామానికి చెందిన తలారి దగ్గు రామకృష్ణ అనే వ్యక్తి అరెస్ట్ చేసినట్లు ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు వెల్లడించారు. సోమవారం మంత్రాలయం పోలీస్ స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. దుల్లయ్య అనే వ్యక్తిని రామకృష్ణ కాలుతో తన్ని నెట్టి వేయడంతో ఆయన కింద పడి సిమెంట్ దిమ్మెకు తగలడంతో తలకు గాయమై మృతి చెందినట్లు తేలింది. మృతుడి సోదరుడు అంజినయ్య ఫిర్యాదు మేరకు మంత్రాలయం పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయడం జరిగింది. కేసు విచారణలో భాగంగా సోమవారం రామకృష్ణ ను సూగూరు గ్రామ సమీపంలో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్ సిబ్బంది ఉన్నారు.

రోటరీ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన రోటరీ క్లబ్ నూతన కమిటీ

ఆదోని అర్బన్: ఆదోని రోటరీ క్లబ్ నతన కమిటీని సోమవారం క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ నామినీ త్రివిక్రమ్ జోషి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని జూబ్లీ హాల్‌లో రోటరీ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక జరిగింది. కార్యక్రమానికి అసిస్టెంట్ గవర్నర్ సయ్యద్‌అబ్దుల్ సత్తార్‌హాజీ, ఆదిత్య నర్సింగ్ ఆసుపత్రి డాక్టర్ శ్రీనివాసులు హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రోటరీ క్లబ్ ఆదోని నూతన అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ సైపుల్లా, మేఘనాథరెడ్డి, ట్రెజరర్‌గా షణ్ముఖతో పాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు జీవన్ సింగ్, డాక్టర్ రాఘవేంద్ర, డాక్టర్ మల్లికార్జునరెడ్డి, ప్రశాంత్‌గాంధీ, భరత్‌షా, సునీల్‌రెడ్డి, హుసేన్, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాతల సాయం.. నిరుపయోగం



ప్యాసింజర్‌ను లగేజీ ట్రాలీపై కూర్చోబెట్టి తరలిస్తున్న కుటుంబ సభ్యులు

ఆదోని అర్బన్: పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో సౌకర్యాలు కరువయ్యాయి. ఇతర ప్రాంతాలకు ఆదోని నుంచి వెళ్లే అనారోగ్యులు, దివ్యాంగులకు వీల్‌చైర్ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. కాగా, పట్టణంలోని దాతలు వీల్‌చైర్‌లు స్టేషన్‌కు విరాళంగా అందించారు. అయితే వీటిని గదిలో భద్రపరిచి నిరుపయోగంగా ఉంచారు. ఆదోని నుంచి తిరుపతికి సోమవారం ఉదయం కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్‌లో రైల్వేశాఖ రిటైర్డ్ చీఫ్ బుకింగ్ సూపర్‌వైజర్ కృష్ణారావు వెళ్లేందుకు వచ్చారు. ఆయన అనారోగ్యంతో నడవలేని స్థితిలో ఉన్నారు. వీల్‌చైర్‌కోసం గాలించగా ఓ తాళం వేసిన గదిలో కనిపించారు. వీటి కోసం స్టేషన్ మాస్టర్, టికెట్ బుకింగ్, ఎంక్వైరీ సిబ్బందిని అడిగానా తమకేమి సంబంధం లేదన్నారు. దీంతో చేసేదేమిలేక కుమారుడు ప్రతాప్, కుటుంబ సభ్యులు లగేజీ తీసుకెళ్లే ట్రాలీలో రైలు వద్దకు తీసుకెళ్లి ఎక్కించారు.